అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -323 శనివారం 28 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# టీమిండియా స్ఫూర్తితో పనిచేయాలి

## సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

- పశ్చిమాసియా సంక్షోభంపై సీఎంలతో ప్రధాని మోదీ సమీక్ష
- ఇంధన సరఫరా, నిత్యావసరాలపై రాష్ట్రాల సన్నద్ధతపై చర్చ
- ఎన్నికల కోడ్ కారణంగా పలు రాష్ట్రాల సీఎంలు భేటీకి దూరం
- చంద్రబాబు, రేవంత్ రెడ్డి తదితర సీఎంలు హాజరు





**న్యూఢిల్లీ,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**
పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రత, నిత్యావసరాల సరఫరా, రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో... చమురు, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో సమన్వయంతో పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు.
అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘర్షణ ప్రభావం భారత్ ఇంధన దిగుమతులు, ఎరువుల సరఫరా, ఇతర వాణిజ్య కార్యకలాపాలపై పడే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. **మిగతా 2లో...**

# కమనీయం.. సీతారామ కళ్యాణం

- మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సిఎం దంపతులు
- రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు
- పలువురు మంత్రులు, ప్రముఖుల రాక




## సిఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు



**న్యూఢిల్లీ,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**నాలుగు రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. **మిగతా 2లో...**

# పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం

- పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు
- సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ
- పెట్రోల్‌పై రూ.13, డీఇల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం

**న్యూఢిల్లీ,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా **మిగతా 2లో...**




## అమరావతిపై మీ స్టాండ్ ఏంటి?

### : జగన్‌కు మంత్రి లోకేశ్ సూటి ప్రశ్న


- అమరావతి రాజధానిపై జగన్ వైఖరి చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్
- 'జే టర్న్ జగన్' అంటూ సోషల్ మీడియాలో విమర్శ
- ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని తమ నినాదమని స్పష్టీకరణ
- టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలని శ్రేణులకు పిలుపు
- ఇంటిపై జెండా ఎగరేసి, సోషల్ మీడియా డీపీలు మార్చాలని సూచన




# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

- ఇరాన్‌పై యుద్ధంలో పూర్తిగా గెలిచామని ప్రకటించిన ట్రంప్
- ఇరాన్ సైనిక శక్తిని దాదాపు నాశనం చేశామని వెల్లడి
- చర్చల కోసం ఇరాన్ కోరిక మేరకు 10 రోజుల గడువు ఇచ్చినట్లు స్పష్టం
- ఒప్పందం కుదరకపోతే విద్యుత్ ప్లాంట్లపై దాడి చేస్తామని హెచ్చరిక
- అణ్వాయుధం చేజిక్కించుకోకుండా ఇరాన్‌ను అడ్డుకున్నామని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**
ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా "పూర్తిగా గెలిచింది" అని, ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని దాదాపు నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అయితే, తదుపరి చర్యలకు ముందు చర్చల కోసం టెహ్రాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఛానెల్‌కు ఫోన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. **మిగతా 2లో...**



## రాజకీయాలకు బ్రేక్.. ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



# 25న పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా

## మేడ్చెల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా

### శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా

### -తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన

**నిజామాబాద్,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. **మిగతా 2లో...**



# కమనీయం..సీతారామ కళ్యాణం

**భద్రాచలం,,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**
శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్చారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరపున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కళ్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద



మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

**మొదటిపేజీ తరువాయి**
అమెరికా సైనిక చర్యలతో ఇరాన్ యుద్ధం చేసే సత్తాను కోల్పోయిందని ట్రంప్ అన్నారు. "మేం ఇప్పటికే యుద్ధం గెలిచాం. సైనికపరంగా ఇరాన్‌ను పూర్తిగా ఓడించాం" అని స్పష్టం చేశారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేనను దెబ్బతీశామని, చాలా వరకు క్షిపణులను, వాటి ప్రయోగ వ్యవస్థలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను కూడా ధ్వంసం చేశామని ఆయన వివరించారు. ఇరాన్ నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొన్నారు.అయితే, ఇంతటి తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఇరాన్ అభ్యర్థన మేరకే తదుపరి దాడులను వాయిదా వేసినట్లు ట్రంప్ తెలిపారు. "చర్చల కోసం మరికొంత సమయం కావాలని వాళ్లు నన్ను అడిగారు. అందుకే నేను వారికి 10 రోజుల గడువు ఇచ్చాను" అని ఆయన చెప్పారు. ప్రస్తుతం చర్చలు సజావుగానే సాగుతున్నాయని కూడా పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఒప్పందం కుదరకపోతే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "వారు చేయాల్సిన పని చేయకపోతే, నేను వారి పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాను" అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ వంటి శత్రు దేశాలు అణ్వాయుధాలు సంపాదించకుండా నిరోధించడమే తమ లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. "ఒక ఉన్మాది లేదా పిచ్చి సిద్ధాంతం చేతిలో అణ్వాయుధం ఉండటానికి వీల్లేదు" అని అన్నారు. అమెరికా కనుక దాడి చేయకపోయి ఉంటే, ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించి, దానిని ఉపయోగించి కూడా ఉండేదని అభిప్రాయపడ్డారు. తన చర్యలపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచంలోనే తమది అత్యంత శక్తివంతమైన సైన్యమని, తమకు ఎవరూ సాటిరారని ట్రంప్ పునరుద్ఘాటించారు.

# రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నం..

## ఆకివీడులో ఉద్రిక్తత

**భీమవరం,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఆకివీడు పెద్దపేటలోని శ్రీరామనవమి వేడుకల్లో ఘర్షణ రాజుకుంది. ఓ వర్గం మరో వర్గంపై దాడి చేయడంతో జనసేన నాయకుడికి, ఇద్దరు కార్యకర్తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక పెద్దపేటలోని రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ వేడుకలను పెదపేటలోని ఒక వర్గం బహిరంగంగానే వ్యతిరేకించినట్లు సమాచారం. హరిజన పేటలో రామాలయంకు వారు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. మరో వర్గం అనుకూలంగా ఉంది. ఈ స్థితిలో రామాలయం నిర్మాణం చేపడతామని స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇటీవల



ప్రకటించారు. ఎమ్మెల్యే అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తున్న ఒక వర్గం ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకను వ్యతిరేకించారు. అయినప్పటికీ పోలీసులు బందోబస్తు మధ్య రఘురామ కృష్ణంరాజు రామాలయంలోకి వచ్చి హారతిచ్చి కొబ్బరికాయలు కొట్టి వెళ్లిపోయారు. అయితే రఘురామకృష్ణ రాజు రాకను వ్యతిరేకించిన వర్గీయులు ఆయన రాకను అడ్డుకున్నారు. దాడికి దిగారు. ఈ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కొందరిపై ఎమ్మెల్యే వెళ్ళిపోగానే మరోసారి దాడి జరిగింది. ఈ దాడిలో జనసేన నాయకుడు గవర అనిల్ తీవ్రంగా గాయపడ్డారు. అతనిపై ఇనప వస్తువులు గాజు వస్తువులతో దాడి చేసినట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు కార్యకర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వీరందరినీ స్థానిక పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు వైద్య సహాయం అందించారు. దాడిని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. అయితే ఈ దాడి ఒక పథకం ప్రకారం ఎమ్మెల్యే పై జరగవలసిందని, తప్పిందని అక్కడ కొందరు గుసగుసలాడుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయం ఎమ్మెల్యే చెవికి చేరడంతో తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కార్యకర్తల పై దాడి తనపై చేసిన ప్రయత్నం ఎలాంటి పరిస్థితుల్లో వదిలేది లేదని హెచ్చరించారు.

# కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

## మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలి -సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ,,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రధానంగా మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సిజెఐ గతవారం 25 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీల భర్తీ విషయాన్ని, ధర్మాసనాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరముందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో మహిళా జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయవద్దని, ఖాళీ కానున్నాయని తెలిసిన వెంటనే వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జడ్జీలకు సూచించారు.

న్యాయరంగంలోని మరింత మంది మహిళలు వచ్చేలా న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు



చేపట్టాల్సి వుందని మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. హైకోర్టు కొలీజియంలు జడ్జీల పదవుల భర్తీ కోసం ప్రతిభావంతులైన మహిళా జడ్జీలను మినహాయించకుండా, వారిని కేటాయించడం ఒక నిబంధనగా పరిగణించాలని అన్నారు. పదోన్నతి కోసం తమ పరిశీలన పరిధిని విస్తృతం చేయాలని, తమ రాష్ట్రాల్లోని, సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవ్యాదులను కూడా చేర్చుకోవాలని హైకోర్టు జడ్జీలకు సూచించారు. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో పలువురు మహిళలు ప్రధాన జడ్జీలుగా విధులు నిర్వహిస్తున్నారని, పంజాబ్, హర్యానా హైకోర్టులో 18మంది మహిళా జడ్జీలు ఉన్నారని పేర్కొన్నారు. మద్రాస్, ముంబయి హైకోర్టుల్లో కూడా సుమారు 12మంది మహిళా జడ్జీలు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో మహిళలు సుమారు 36.3శాతం ఉన్నారని సిజెఐ పేర్కొన్నారు. ఇది ఒక సాధారణ గణాంకం కాదని, ఇది తరాల మార్పును ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యవస్థ పునాదిలోనే ఎక్కువ మహిళా భాగస్వామ్యం ఉన్నప్పుడు, అది అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా త్వరలోనే ప్రతిబింబిస్తుందని అన్నారు.

# పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**
పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

# టీమిండియా స్ఫూర్తితోపనిచేయాలి

**మొదటిపేజీ తరువాయి**
ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఈ సమీక్ష చేపట్టారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూడటం, సరఫరా గొలుసును పటిష్ఠపరచడం, నల్లబజారు, కృత్రిమ కొరతను నివారించడం వంటి అంశాలపై ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ సహా పలువురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు ఈ భేటీకి హాజరుకాలేదు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ విడిగా సమావేశమవుతుందని కేంద్రం తెలిపింది.

# సిఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

**మొదటిపేజీ తరువాయి**
మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

# అమరావతిపై మీ స్టాండ్ ఏంటి?

## : జగన్‌కు మంత్రి లోకేశ్ సూటి ప్రశ్న

**అమరావతి,,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**
అమరావతి రాజధాని అంశంపై వైసీపీ అధినేత జగన్ తన వైఖరిని స్పష్టం చేయాలని ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. "ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని మా నినాదం. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. అమరావతి పై మీ స్టాండ్ ఏంటి జే టర్న్ జగన్ గారూ?" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన సవాల్ విసిరారు. రాజధానిపై తమ ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేస్తూనే, జగన్‌ను లోకేశ్ సూటిగా ప్రశ్నించారు.మరోవైపు, తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో లోకేశ్ ట్వీట్ చేశారు.

"తెలుగువారి ఆత్మగౌరవం కోసం, అణగారిన వర్గాలకు అండగా మన తెలుగుదేశం పార్టీ పుట్టి 44 సంవత్సరాలైంది. తెలుగుదేశం కుటుంబ సభ్యులమైన మనకు ఇది గర్వకారణమైన సందర్భం. ఆవిర్భావ స్ఫూర్తి, ఐకమత్యం చాటే సమయం ఇది. ఇది ఒక చిత్రం కాదు... రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమ, సకల శుభాల గెలుపుకు సంకేతమైన పసుపు జెండా ప్రస్థానం. మీ సోషల్ మీడియా ఖాతాలలో డీపీని పెట్టి, మీ ఇంటిపై పార్టీ జెండా ఎగరేసి 'నేను తెలుగు వాడిని... నాది తెలుగుదేశం పార్టీ' అని గర్వంగా చాటండి" అంటూ లోకేశ్ పిలుపునిచ్చారు.

# 25న పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా

ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

# రాజకీయాలకు బ్రేక్.. ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**
నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆటల బరిలోకి దిగనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి.
ఈ విషయాన్ని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభలో అధికారికంగా ప్రకటించారు. ఈ క్రీడల నిర్వహణ కోసం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఛైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కో-ఛైర్మన్‌గా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు
ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడంతో పాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడలతో పాటు



రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఘనంగా ఏర్పాటు చేయనున్నారు.
ఈ పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్యే మకన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులను నియమించారు. గురువారం నాడు కమిటీ సభ్యులు సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 28న మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభమవుతాయని కమిటీ స్పష్టం చేసింది. అంతకుముందు మంత్రులు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి.. స్పీకర్‌ను కలిసి స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు.

# పర్యావరణ హితంగా సీతారాముల కళ్యాణం

## కేశవాపురంలో మోదుగ ఆకుల్లో ప్రసాద వితరణ





**రాయపర్తి/మార్చి 27(జర్నలిస్ట్ వార్త);**ఆధ్యాత్మికతకు పర్యావరణ స్పృహ తోడైతే అది సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని రాయపర్తి మండలంలోని కేశవాపురం గ్రామస్తులు నిరూపించారు. గ్రామంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణ సందేశంతో సాగడం విశేషం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "99 రోజుల ప్లాస్టిక్ నిషేధ కార్యాచరణ ప్రణాళిక"లిలో భాగంగా, ఈ వేడుకల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేశారు. సాధారణంగా శుభకార్యాల్లో కనిపించే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులుగా, పురాతన పద్ధతిని పునరుద్ధరిస్తూ మోదుగ ఆకుల్లో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే అనర్థాలను వివరిస్తూ గ్రామస్తులను నిర్వాహకులు చైతన్యపరిచారు. పాత పద్ధతులే ఆరోగ్యానికి మేలని, ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని ఈ సందర్భంగా చాటిచెప్పారు. ఈ వినూత్న కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ సుధాకర్, ఉప సర్పంచ్ చెదలు బిక్షపతి, సామాజిక ఉద్యమకారుడు మరియు 6వ వార్డు సభ్యుడు చిలుమల్ల కృష్ణ పాల్గొన్నారు. వీరితో పాటు గర్వందుల భాస్కర్, పొగాకు యాకన్న, అనంతుల శ్రీనివాస్, గౌని యాకన్న, బొలగాని అంజయ్య, ఒగ్గుల సురేష్, సతీష్, కరోబార్ దేవేందర్ , గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# స్నేహితుని కుటుంబానికి చిన్నారుల సహాయం

**చిన్నారుల పెద్ద మనసు.. స్నేహితునికి తోడుగా నిలిచిన తోటి విద్యార్థులు**



**భీమదేవరపల్లి/మార్చి27 (జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరి గ్రామంలో చిన్నారుల మనసును కదిలించే సంఘటన చోటుచేసుకుంది. ఇటీవల గ్రామానికి చెందిన పార్నందుల ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడు చెర్రీ గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. స్నేహితుని తండ్రి మరణించిన విషయం తెలుసుకున్న చెర్రీ తోటి విద్యార్థులు శుక్రవారం కలిసి డబ్బులు సేకరించి అతని కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితుడికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. చిన్నారుల ఈ పెద్ద మనసును గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చరణ్, తనీష్, విగ్నేష్, నిశాంత్, జగదీష్, ఎండి తౌఫిక్, ఆకర్షిత్, వర్షిత్, గ్రీష్మ, లక్ష్మి, సాహితీ, ఐశ్వర్య, అద్విక, ధన్వి, శ్రీ సహస్ర, ప్రణవి, వర్షిక, లక్ష్మీ సాయి తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

## అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం -భక్తులతో కిటకిటలాడిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం







**భీమదేవరపల్లి/మార్చి27 (జర్నలిస్ట్ వార్త):**

భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలోని శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ రామనవమి పండుగను పురస్కరించుకుని శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించగా, భక్తులు భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. కళ్యాణోత్సవ సమయంలో భక్తులు "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. గ్రామస్తులు మరియు సమీప గ్రామాల నుండి వచ్చిన భక్తులు కూడా ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కళ్యాణోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదంగా అన్నదానం చేసి, అందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ సంధానకర్తలు శిలగాని వరలక్ష్మి విజయ్ కుమార్, శిలగాని కల్పన అజయ్ కుమార్, శిలగాని వసంత రాజ్ కుమార్, శిలగాని రమాదేవి కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు కార్యక్రమం విజయవంతం కావడానికి ముందుండి ఏర్పాట్లు చేశారు. ఈ పవిత్ర వేడుకలో హవల్దార్‌పల్లి యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కత్తులు అజయ్ కుమార్, శివ, అజయ్, సారధి, తిరీష్, హరీష్ తదితరులు సేవాభావంతో కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లలో సహకరించారు. భక్తులకు నీరు, ప్రసాదం పంపిణీ చేయడం, క్రమబద్ధంగా కార్యక్రమం నిర్వహించేందుకు యువత సహకరించింది. గ్రామ పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు ఇలా అన్ని వయసుల వారు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని కుటుంబ సౌఖ్యం, శాంతి, సమృద్ధి కలగాలని ప్రార్థించారు. మొత్తం కార్యక్రమం భక్తి పారవశ్యంతో సాగి గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.

# ప్రాణ రక్షణ కవచం హెల్మెట్

## : రాయపర్తి ఎస్సై ముత్యం రాజేందర్ -అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు అవగాహన

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు -మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత




**రాయపర్తి/మార్చి 27 (జర్నలిస్ట్ వార్త):** నిర్లక్ష్యం వద్దు.. నిబంధనలే ముద్దు అంటూ రాయపర్తి మండల కేంద్రంలో 'అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై వాహనదారులకు, విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎస్సై ముత్యం రాజేందర్ మాట్లాడుతూ, మితిమీరిన వేగం, అజాగ్రత్త వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది కేవలం నిబంధన మాత్రమే కాదు, ప్రాణ రక్షణ కవచమని స్పష్టం చేశారు. "వేగం కన్నా ప్రాణం ముఖ్యం" అని గుర్తించి, నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని విద్యార్థులకు సూచించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని (డ్రంక్ అండ్ డ్రైవ్) ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడటం వల్ల దృష్టి మళ్లి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇలాంటి పొరపాట్లు చేయవద్దని కోరారు.

ముఖ్యంగా చిన్న వయసు పిల్లలకు, వాహనాలు ఇచ్చి వారి ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి అరైవ్ అలైవ్ లక్ష్యానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక యువత , వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మంత్రి వివేక్‌ను ఆహ్వానించిన బీఎన్ఆర్‌కేఎస్ నేతలు

## జనగామ మహాసభకు హాజరవుతానన్న హామీ





**హనుమకొండ/ బ్యూరో మార్చి 27 (జర్నలిస్ట్ వార్త):**

సోమాజిగూడలోని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నివాసంలో బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని, ఏప్రిల్ 7న జనగామ జిల్లాలో నిర్వహించనున్న మహాసభకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మహాసభకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.ఈ భేటీలో బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ధరిపల్లి చంద్రం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, కార్యదర్శి రసమల్ల కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్య, కార్యదర్శి నిర్మలా సత్యం, అరూరి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ, రాష్ట్రం, జిల్లాల స్థాయిలో ఎన్నో మహాసభలు నిర్వహించినప్పటికీ కార్మికుల సమస్యలు వినేందుకు ఎమ్మెల్యేలు, మంత్రులు ముందుకు వచ్చిన సందర్భాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం అమల్లో ఉన్న 1996 చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయించుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు.కార్మికుల హక్కుల సాధనలో ప్రతి ఒక్కరూ సైనికుడిలా ముందుండాలని, జనగామలో జరిగే మహాసభకు ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా కార్మిక సోదరులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# స్టేజిపినపాకలో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

## భక్తి పరవశంలో మునిగిపోయిన భక్తజనం



**వైరా/మార్చి 27 (జర్నలిస్ట్ వార్త):**మండల పరిధిలోని స్టేజిపినపాక గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.ఈ పవిత్ర మహోత్సవంలో కళ్యాణ పీటలపై దేవనకొండ రామభద్ర రాజు దంపతులు, దేవనకొండ కొండల రాజు దంపతులు కూర్చుని స్వామివారి దివ్య కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ, సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకను చూసి భక్తులు పులకించిపోయారు.కళ్యాణోత్సవానికి గ్రామ పెద్దలు, మహిళలు, యువత అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. కళ్యాణం అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.గ్రామస్తులందరి సమిష్టి సహకారంతో, భక్తి మరియు సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవం విజయవంతమైంది.ద

# ధర్మసాగర్‌లో భక్తి వెల్లువ

## ఘనంగా సీతారాముల కళ్యాణం





**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరో మార్చి 27 (జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రం భక్తిరసంతో మునిగిపోయింది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రంగాచార్యులు, నరసింహాచార్యులు, భాస్కరాచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించగా, ఆలయం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.


"జై శ్రీరామ్" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఎండ తీవ్రతను లెక్కచేయకుండా భక్తులు భారీగా తరలివచ్చి కళ్యాణాన్ని దర్శించుకున్నారు. సీతారాముల దివ్య కళ్యాణాన్ని కళ్లారా వీక్షించేందుకు మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, గ్రామ పెద్దలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధల నడుమ జరిగిన ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి.

# సిరిపురంలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

**వైరా/మార్చి 27 (జర్నలిస్ట్ వార్త):**

మండలంలోని సిరిపురం కేజీ గ్రామంలో శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది.కందిబండ శైలజ రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో కందిబండ నరసింహారావు, ఇందిర దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజారుల మంత్రోచ్చారణలు, వేదఘోషల మధ్య జరిగిన ఈ వేడుక భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది.గ్రామ ప్రజలు పెద్దఎత్తున హాజరై స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, సీతారాముల కళ్యాణం గ్రామంలో విశేష ఆకర్షణగా నిలిచింది.



# కుర్నవల్లిలో సీతారాముల కల్యాణం వైభవంగా

## పట్టు వస్త్రాలు సమర్పించిన సర్పంచ్ శేషమ్మ



**తల్లాడ/, మార్చి 27 (జర్నలిస్ట్ వార్త):**



భక్తి శ్రద్ధల నడుమ కుర్నవల్లి గ్రామంలోని మర్రిచెట్టు సెంటర్ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ తరఫున సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి భక్తి చాటుకున్నారు. అర్చకులు అవధానుల రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవం సంప్రదాయబద్ధంగా, కన్నుల పండుగగా సాగి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం సర్పంచ్ శేషమ్మను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుహాసిని, మాజీ సర్పంచులు గంటల రమాదేవి, ఐలూరి లక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ గుర్రాల లక్ష్మారెడ్డి, గ్రామ పెద్దలు ఐలూరి వెంకట కోటారెడ్డి, ఐలూరి శివారెడ్డి, గంటల వెంకటాచారి, పోతురాజు వెంకటయ్య, ఎక్కిరాల వెంకటేశ్వర్లు, ఆదూరి బుచ్చాలు, గుర్రాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని విజయవంతం చేశారు.

# వర్ధన్నపేటలో వైభవంగా సీతారాముల కళ్యాణం

**పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు**

**భక్తులకు ఆశీస్సులు అందజేసిన ఎమ్మెల్యే**





**వర్ధన్నపేట, మార్చి 27(జర్నలిస్ట్ వార్త;**

వర్ధన్నపేట పట్టణంలోని శ్రీరామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు గౌరవ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే నాగరాజు గారికి వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి గారు శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఆలయ పూజారులు, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ ఎమ్మెల్యే గారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యే గారు చైర్మన్ సారంగపాణి గారితో కలిసి పీటలపై కూర్చుని కళ్యాణోత్సవ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ శ్రీ సీతారాముల కృపాకటాక్షాలతో వర్ధన్నపేట పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధికి స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరుకున్నారు. ఎలాంటి అవాంతరాలు కలగకుండా భక్తుల సౌకర్యార్థం కళ్యాణ వేడుకలను పకడ్బందీగా ఏర్పాటు చేసిన మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి గారిని ఎమ్మెల్యే మరియు పట్టణ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ ఇమ్మడి సుధీర్ బాబు, వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి రాజేందర్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, కమిలి కీమా నాయక్, తిరుపతి, వాణికుమార్, స్వామి, దేవేందర్, సమ్మెట శ్రీనివాస్ గౌడ్, రాజేష్ ఖన్నా, సమ్మెట సుధీర్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పవన్, పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# జిల్లా టిడిపి కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఖమ్మం/, మార్చి 27 (జర్నలిస్ట్ వార్త):**



తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఖమ్మం నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ కూరపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ స్థాపన నుంచి ఇప్పటివరకు సాధించిన విజయాలను స్మరించుకుంటూ, నాయకులు, కార్యకర్తలు కలిసి వేడుకల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తల ఐక్యతే బలమని పేర్కొన్న వెంకటేశ్వర్లు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన కళ్యాణం





**స్టేషన్ ఘన్పూర్/మార్చి 27 : (జర్నలిస్ట్ వార్త) :**

స్టేషన్ఘన్పూర్, చిల్పూర్ మండలాల్లో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా సీతారామచంద్ర స్వామి కళ్యాణం ఘనం గా నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ముత్యాల తలంబ్రా లు పట్టుకుని వచ్చి అర్చకులు కళ్యాణా న్ని కమనీయంగా జరిపించారు. చిన్పూర్ మండలంలోని నష్కల్ గ్రామం లో కళ్యాణ మండపంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. జాతర ప్రాంగణంలో చిన్నపిల్లల కోసం హలో దుకాణాలు వేశాయి. అదేవిధంగా చిల్పూర్ దేవస్థాన ఆవరణలో రాములో రి కళ్యాణం దేవాలయ చైర్మన్ పట్లపల్లి శ్రీధర్ రావు, ఏవో లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహిం చారు. జూనియర్ మోహన్, వీరన్న, మల్లికార్జున్, ప్రధాన అర్చకుడు బి



రవీందర్ శర్మ, అర్చకులు సామి త్రి రంగాచార్యులు, కృష్ణమాచా ర్యులు రికార్డు అసిస్టెం ట్ వీరన్న, ఆలయ సిబ్బంది విశాల్, రాజశేఖర్, మహేష్,కృష్ణ , మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని తాడికొండలో కూడా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో వేసినటువంటి శ్రీ సీతారామచం ద్ర స్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణం అంగ రంగ వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్, శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, జిట్టగూడం సర్పంచ్ బానోతు బాలు నాయక్, శ్రీ సీతా రామచంద్రస్వామిదేవస్థానం చైర్మన్ పండుగ భద్రయ్య, ఉప సర్పంచ్ రవి, చల్ల మధుసూదన్ రెడ్డ, మాజీ సర్పంచ్ చల్లా ఉమా సుధీర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి నర్మదా, కుంబోజి రాములు, ఎడమ కట్టమలు, కుసుమ రమేష్, మంజుల, రాజిరెడ్డి, రాజు, రాములు, పోకల నారాయణ, నరేష్ తదితర నాయకులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు కళ్యాణాన్ని తిలకించి స్వామివారికి మొక్కు లు చెల్లించారు.

# సింగారంలో కన్నుల పండుగగా భద్రాద్రి సీతారాముల కల్యాణం..



**బయ్యారం/,మార్చి 27.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు రామ్మూర్తి శాస్త్రి వేద మంత్రోచ్చరణలు మధ్య శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. గంగవత్ రాజన్న పద్మ, దంపతులు పట్టువస్త్రాలు, గుగులోత్ అమిర్యా, పుల్లి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణలు, రామ భక్తుల జయజయ ధ్వనాల మధ్య అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సీతారాములవారి శిరస్సుపై ఉంచారు. ఇది శుభ ముహూర్తం కాగా జగత్ కల్యాణ శుభ సన్నివేశం ఆవిష్కృతమైంది. రామయ్య సీతమ్మ మెడలో మాంగళ్య దారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక ఆ తర్వాత బ్రహ్మ బంధనం వేశారు. ఈ కళ్యాణ వేడుకలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం.



**బయ్యారం,మార్చి 27.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కేంద్రంలో రాములోరి కల్యాణ వేడుక కనుల పండుగగా నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో రాముడు, జగన్మాత సీతమ్మ మెడలో మాంగళ్యధారణ ఘట్టం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో అశేష భక్త జనవాహినితో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. దాసరి బుచ్చయ్య, పద్మ, చెరుకుపల్లి నర్సయ్య, నాగమణి దంపతులు స్వామి వారికీ పట్టు వస్త్రాలు అందజేశారు. పాండవుల లింగయ్య, పాపమ్మ, వెమిశెట్టి కోటి, రూప దంపతులు స్వామివారికి తలంబ్రాలు తీసుకురాకురాగా ఆలయ చైర్మన్ గాదె కృష్ణ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన చార్యులు మంత్రోచ్చారణల మధ్య కళ్యాణం జరిపించగా ఆ దేవ దేవుడి కల్యాణ వైభోగాన్ని కనులారా వీక్షించి భక్తులు పులకించారు. మేళ తాళాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి వారి ఆభరణాలను ఉత్సవ మూర్తులకు అలంకరించారు. కల్యాణ వైభవంను చాటుతూ చూర్ణికను పఠించిన అనంతరం వేద మంత్రోచ్చారణాలు మార్మోగుతుండగా జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతరాముల శిరస్సుపై ఉంచారు. ఈ కల్యాణ కమనీయ వేడుకను కనులారా భక్తులు వీక్షించి తన్మయత్వం పొందారు. భక్తుల రామ నామస్మరణ మధ్య



జగదభిరాముడు జానకమ్మను మనువాడాడు. రాముడు దోసిట తలంబ్రాలు నీలపురాసులుగా జానకి దోసిట తలంబ్రాలు మనిమాణిక్యాలై సాక్ష్యాత్కరించిన వేళ సీతారాముల పరిణయ ఘట్టం ముగిసింది. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో బయ్యారంలో ఊరేగించి గర్భగుడిలోకి తీసుకవెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# యువత ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి


## . ట్రైని ఐపీఎస్ మనీషా నెహ్రా



**స్టేషన్ ఘన్పూర్/ మార్చి 27 (జర్నలిస్ట్ వార్త) :**యువత రోడ్లపై బైకులు, కార్లు ఇతర వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలే ప్రాణా,రక్షణ కు కవచాలని హెల్మెట్ సీట్ బెల్టు తప్పనిసరి ఉపయోగిం చాలని ట్రైని ఐపీఎస్ మనీషా నెహ్రా అన్నారు. స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారు పై వేర్లు ఆనంతరం వాహనాల తనికినిర్వహించి ఏర్పా టు చేసిన రోడ్డు భద్రతపై నిర్వహిం చిన అవగాహన సదస్సు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కట్టారీత్యా చర్యలు తప్పవన్నా రు. ఈ కార్యక్రమంలో ఏసీపీ భీమ్ శర్మ, సీఐజీ వేణు, సీఐ శ్రీనివాస్ రెడ్డి,ఎస్ ఐ వినయ్ కుమార్, రమేష్, రాజేష్, మనీషా, నవీన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు -మార్పుకు మేలుకొలుపు

దేశ నిర్మాణంలో యువత పాత్ర అనన్యసామాన్యం. "యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు" అన్న మాట కేవలం నినాదం కాదుడ ఇది ఒక నిబద్ధత, ఒక బాధ్యత. నేటి సమాజంలో వేగంగా మారుతున్న పరిస్థితులు, సాంకేతిక విప్లవం, ప్రపంచీకరణ ప్రభావం కలిపి చూస్తే, దేశాన్ని ముందుకు నడిపించేది యువశక్తే అనేది స్పష్టమవుతోంది. వారి ఆలోచనలే రేపటి విధానాలు, వారి కృషియే రేపటి అభివృద్ధి. యువతలో ఉత్సాహం ఉంది, ఆత్మవిశ్వాసం ఉంది, కొత్తదాన్ని సృష్టించే తపన ఉంది. ఇదే దేశానికి నిజమైన మూలధనం. వ్యవసాయం నుంచి ఐటీ వరకు, విద్య నుంచి వైద్య రంగం వరకుప్రతి రంగంలో యువత అడుగులు వేస్తే అభివృద్ధి వేగం పెరుగుతుంది. స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానంఇవి యువత చేతుల్లోనే విస్తరిస్తున్నాయి. అయితే ఈ శక్తి సరైన దిశలో నడిస్తేనే ఫలితం



ఉంటుంది. కానీ, మరోవైపు కొన్ని సవాళ్లు కూడా యువత ముందున్నాయి. నిరుద్యోగం, మత్తు పదార్థాల అలవాటు, సోషల్ మీడియా దుర్వినియోగంఇవి యువతను తప్పుదోవ పట్టించే ప్రమాదాలు. ఇవి కేవలం వ్యక్తిగత నష్టమే కాదు, దేశ భవిష్యత్తుకే ముప్పు. కాబట్టి యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

విద్యతో పాటు నైతిక విలువలు కూడా యువతకు అవసరం. కేవలం ఉద్యోగం కోసం చదవడం కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా



ఆలోచించే మనస్తత్వం పెంపొందాలి. నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తిఈ విలువలు ఉన్న యువతే సమాజాన్ని ముందుకు నడిపించగలదు. కుటుంబం, గురువులు, ప్రభుత్వంకలిసి యువతను సరైన మార్గంలో నడిపించాల్సిన అవసరం ఉంది.

దేశం ఎదగాలంటే యువత ముందుకు రావాలి. సమస్యలను విమర్శించడం మాత్రమే కాకుండా, పరిష్కారాలు చూపే ధైర్యం యువతలో ఉండాలి. ఓటు హక్కు వినియోగం నుంచి సామాజిక సేవ వరకుప్రతి రంగంలో యువత చురుకుగా పాల్గొనాలి. అప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది, దేశం అభివృద్ధి చెందుతుంది. ముగింపుగా చెప్పాలంటే, యువత శక్తి సక్రమంగా వినియోగమైతే దేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుంది. అలాంటి యువతను తీర్చిదిద్దడం మన అందరి బాధ్యత. యువత మేల్కొంటే దేశం మేల్కొంటుందిడ యువత ముందుకు నడిస్తే దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది.



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ లెనిన్
9908401581

# గంధంపల్లిలో ఘనంగా రాములోరి కల్యాణం..

## -పట్టు వస్త్రాలు సమర్పించిన సర్పంచ్.





**బయ్యారం/,మార్చి 27.(జర్నలిస్ట్ వార్త)**శ్రీరామ నవమిని పురస్కరించుకొని బయ్యారం మండలం గంధంపల్లి రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.కల్యాణ వేడుకల వేళ గంధంపల్లి గ్రామంలో రామనామ స్మరణతో పులకించిపోయాయి.స్వామి వారికీ కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.రాములోరి కల్యాణ వేడుక కనుల పండుగగా సాగింది.అభిజిత్ లగ్నంలో రాముడు,జగన్మాత సీతమ్మ మెడలో మాంగళ్యధారణ ఘట్టం అంగరంగ వైభవంగా నిర్వహించారు.అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో కలకాలం జీవించాలని సర్పంచ్ ప్రవీణ్ నాయక్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**తల్లాడ/, మార్చి 27 (జర్నలిస్ట్ వార్త):**మండలంలోని అన్నారుగూడెం గ్రామ పరిధిలోని నిమ్మగూడెంలో శ్రీ సీతారాముల స్వామివారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో సాగాయి.ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించగా, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కనులారా తిలకించి భక్తి పరవశంలో మునిగిపోయారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.రామాలయ కమిటీ అధ్యక్షుడు దుగ్గినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పొన్నం వెంకటయ్య, గుమ్మా నరేష్, బట్టు రాములు, గుమ్మా శ్రీను, దిరిశాల శ్రీను, కొమ్మినేని రవి, గుమ్మా రామకృష్ణ, పొన్నం కృష్ణయ్య, గుమ్మా హరి తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు భారీగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# చికెన్ ప్రియులకు షాకింగ్ న్యూస్. -భారీగా కుళ్లిన చికెన్ పట్టివేత

**హైదరాబాద్,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):** సిటీలో చికెన్ తినే వారికి షాకింగ్ న్యూస్. కోల్డ్ స్టోరేజ్ లో గట్టిగా గడ్డ కట్టి.. బూజు పట్టి.. కుళ్లిపోయిన పరిస్థితిలో షాపులకు చేరుతోంది.శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో దొరికిన చికెన్ చూస్తే షాకవ్వాల్సిందే. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను స్థానిక విక్రేతలకు సరఫరా చేస్తున్న ఒక వ్యక్తిని హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందం అరెస్ట్ చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు, హెచ్-ఫాస్ట్ బృందం వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కె. నాగార్జునతో కలిసి మూసాపేట సమీపంలోని భరత్ నగర్, జింకలవాడ వద్ద ఉన్న 'మెసర్స్ ఎస్.పి.ఆర్ చికెన్' ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో



నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను గుర్తించారు. దీనిని స్థానిక
హోటళ్లు, చికెన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనకు సంబంధించి సూరజ్ పాల్ (66), అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కూకట్‌పల్లి రాజీవ్ గాంధీ నగర్ లో నివాసం ఉండే పాల్ చికెన్ హోల్ సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కోల్డ్ స్టోరేజ్ సెంటర్ నుంచి సుమారు 352 కిలోల గడ్డకట్టిన కుళ్ళిన చికెన్ స్వాధీనం చేసుకున్నారు. అందులో రెక్కలు, చెస్ట్, లివర్, గిజార్డ్ వంటి భాగాలు స్వాధీనం చేసుకున్నారు. చికెన్ నిల్వ ఉంచిన ప్రాంగణం అత్యంత అపరిశుభ్రంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈꠓాంఎ లైసెన్స్ గడువు ముగిసినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి నిర్వహిస్తున్నారు. నిల్వ చేసిన మాంసం తినడానికి యోగ్యమైనది కాదని తెలిపారు. హెచ్-ఫాస్ట్ బృందం స్వాధీనం చేసుకున్న మాంసాన్ని, నిందితుడిని సనత్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో హెచ్-ఫాస్ట్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, సనత్ నగర్ పోలీసులు పాల్గొన్నారు.

# పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

### దీంతో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి

### పొలాలు, నీరు కలుషితం అవుతున్నాయి

### లోక్‌సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య డిమాండ్




**న్యూఢిల్లీ,మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):** పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సహా తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలువురు వైద్య నిపుణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ముప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు , వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని.. ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.

# కమనీయం

## సీతారాముల కళ్యాణం





**భద్రాచలం,/ మార్చ్ 27 (జర్నలిస్ట్ వార్త):**
దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తి, భవ్యం, వైభవం మేళవింపుగా అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ దివ్యోత్సవానికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి లక్షలాది భక్తులు తరలివచ్చి, రామనామ స్మరణలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు.పూర్వాహ్నం నుంచే ఆలయ పరిసర ప్రాంతాలు భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక పూజలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణం కనులపండువగా జరిగింది. స్వామివారిని అద్భుతంగా అలంకరించి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయ ప్రాంగణం భక్తులను ఆహ్లాదానికి గురిచేసింది. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, పుష్పాలంకరణలతో కళ్యాణ వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగాయి.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి, రాష్ట్ర ప్రజల తరపున ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొని వేడుకలను వీక్షించారు.అలాగే ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకటరావు, ఎంపీలు బలరాం నాయక్, వేమ నరేందర్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు సహా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై కళ్యాణ మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ముందుగా ఐటీసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన సీఎం రేవంత్ రెడ్డికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకున్న సీఎం, దేవస్థాన అర్చకుల చేత పూర్ణకుంభ స్వాగతం స్వీకరించి, ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.

కళ్యాణ వేడుకల సందర్భంగా భక్తులు “జై శ్రీరామ్” నినాదాలతో ఉత్సాహంగా పాల్గొని, రామనామ స్మరణలో లీనమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. త్రాగునీరు, ప్రసాదం, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.భక్తి, సంప్రదాయం, వైభవం కలగలిసిన ఈ సీతారాముల కళ్యాణ మహోత్సవం భద్రాచలంలో మరొకసారి ఆధ్యాత్మికోత్సాహాన్ని నింపింది.





